మురుగునీటికి శాశ్వత పరిష్కారం చూపాలి

హిమాయత్ నగర్ వైజంక్షన్‌లో మురుగు నీటిని తొలగింపజేయిస్తున్న మహాలక్ష్మి రామన్‌గౌడ్

హిమాయత్‌నగర్, మార్చి7 : బస్తీలు, కాలనీలు, ప్రధాన రహదారులపై మురుగునీరు పొంగిపొర్లడం వల్ల స్థానికులు వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పొంగి పొర్లకుండా ఉండేందుకు ముందస్తు నిర్వహణ చర్యలు తీసుకోవాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మిరామన్‌గౌడ్ నారాయణగూడ జలమండలి అధికారులకు ఆదేశించారు. హిమాయత్‌నగర్ వైజంక్షన్ ప్రాంతంలో మురుగునీరు రోడ్డుపై పారుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆమె జలమండలి సిబ్బందిని పిలిపించి సమస్యను పరిష్కారం చేయించారు. ఈ కార్య క్రమంలో బీఆర్ఎస్ నాయకులు జి.రామన్‌గౌడ్, మహేష్,అనీశ్,జైస్వాల్ పాల్గొన్నారు.

సవాళ్లను స్వీకరించే సత్తా మహిళలకు ఉంది

ఏపీ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రేఖారాణిని సత్కరిస్తున్న సుల్తాన్ ఉల్ ఉలూమ్ కళాశాలల ప్రిన్సిపాల్స్

ఎంజీఐటీలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొన్న కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్.సుమలత

- అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు
- ఐపీఎస్ అధికారి రేఖారాణి

బంజారాహిల్స్, మార్చి 7: గతంతో పోలిస్తే ప్రస్తుతం మహిళలకు కుటుంబ సభ్యుల నుంచి ప్రోత్సాహం ఎక్కువగా లభిస్తోందని, సరైన అవకాశాలు వస్తే ఎలాంటి సవాళ్లనైనా స్వీకరించే సత్తా మహిళలకు ఉందని ఏపీ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రేఖారాణి అన్నారు. బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఎడ్యుకేషన్ సొసైటీలో మహిళా అధ్యాపకుల ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో రేఖారాణి పాల్గొని మాట్లాడారు. నేడు అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని, పురుషులకు దీటుగా విజయాలు సాధిస్తున్నారన్నారు. మహిళలు తమలోని శక్తిసామర్థ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకుని తమ రంగంలో విజయం కోసం ప్రయత్నించాలని సూచించారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డా.అనుపమ కోనేరు, న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరి, డా.లక్ష్మి, ఫాతిమా, విభా ఆస్థానా, లక్ష్మీ కుమారి, డా. ఇష్రత్ పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో..

జూబ్లీహిల్స్ డివిజన్ బీజేఆర్‌నగర్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మహిళా దినోత్సవంలో బీఆర్ఎస్ సీనియర్ నేత మామిడి నర్సింగరావు ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను సత్కరించారు. అనంతరం వారితో కలిసి కేక్‌కట్ చేశారు. స్థానిక మహిళా సంఘాల నాయకురాళ్లు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం

కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ సుమలత

మణికొండ, మార్చి 7: సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో కీలకమైందని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ సి.హెచ్.సుమలత అన్నారు. మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఉమెన్ డెవలప్‌మెంట్ కమిటి చైర్‌పర్సన్ డాక్టర్ జి.మాధవి, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ సి.హెచ్.సుమలత, ఎంజీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.సుధాకర్‌రెడ్డిలతో కలిసి హాజరయ్యారు. నేటి తరానికి చెందిన శరీరక, మానసిక ఆరోగ్యానికి సంబంధించిన అనేక రుగ్మతులపై వివరించారు. ఈ కార్యక్రమంలో వృజాలి డిల్లికర్‌రెడ్డి, నాట్య తరంగిణి డైరెక్టర్ యామిని రెడ్డి, సీబీఈఎస్ కోశాధికారి డి.సంధ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపినాథ్ గురువారం యూసుఫ్‌గూడ డివిజన్ లేబర్ అడ్డా వద్ద షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఆయా పథకాల్లో 8మంది లబ్ధిదారులకు రూ.8,00,928 విలువ చేసే చెక్కులను కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్‌తో కలిసి అందజేశారు. బీఆర్ఎస్ యూసుఫ్‌గూడ, ఎర్రగడ్డ డివిజన్‌ల అధ్యక్షులు సంతోష్, సంజీవ, నాయకులు పాల్గొన్నారు. – జూబ్లీహిల్స్,మార్చి 7

ఓటు ఎంతో విలువైనది : డీన్ ప్రశాంత్

వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 7 : ఓటు ఎంతో విలువైనదని, కొండా లక్ష్మణ్ తెలంగాణ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా.ప్రశాంత్ అన్నారు. గురువారం కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మెరాపెహలా ఓటు దేశ్ కేలియే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యదేశం మనదని, ఓటు అనే ఆయుధంతో మనకు నచ్చిన సరైన వ్యక్తిని పాలకుడిగా ఎన్నుకునే అవకాశం ఉందన్నారు. చాలా మంది విద్యార్థులకు ఈ సారే కొత్తగా ఓటు వేసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ సంతోషిని లావణ్య, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అంతకు ముందు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డా. నాగహర్షిత, అశ్వినికుమార్, శ్రీనివాసులు, శ్రీరాములు తదితరులు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

ఆస్తి పన్ను చెల్లించి అభివృద్ధికి తోడ్పడాలి

పన్ను చెల్లించిన వారికి రసీదు అందజేస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ,మార్చి 7: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆస్తి పన్నుదారులు తమ ఆస్తి పన్నును వెంటనే చెల్లించాలని కమిషనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. ఆయన కార్పొరేషన్ పరిధిలోని బిల్ కలెక్టర్లతో కలిసి ఆస్తి పన్నుపై అవగాహన కల్పించారు. అనంతరం పలువురి నివాసాలకు వెళ్లి ఆస్తి పన్నును కట్టించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఆస్తిపన్ను దారుడు తమ ఆస్తి పన్నును చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి తోడ్పడలన్నారు.

మహిళల ఆరోగ్య సమస్యలపై సదస్సు

బంజారాహిల్స్,మార్చి 7:మహిళల్లో వచ్చే ఆరోగ్య సమస్యలు, హార్మోన్‌ల ప్రభావంతోపాటు ఇతర అంశాలపై బంజారాహిల్స్‌లోని ఫెర్నాండెజ్ హాస్పిటల్స్‌లో గురువారం సదస్సు నిర్వహించారు. డయాగ్నసిస్ టు వెల్‌బీయింగ్–రీసెంట్ అప్‌డేట్స్ పేరుతో ఇండియా అసోసియేషన్ ఫర్ పేరెంటల్, ఎంటరల్ న్యూట్రిషన్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో భాగంగా హార్మోన్ సమస్యలు, పోషకాహార లోపాలతో ఏర్పడే సమస్యలు, మధుమేహం తదితర అంశాలతోపాటు బాలింతలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు, వాటి పరిష్కారాలపై చర్చించారు. ఫెర్నాండెజ్ హాస్పిటల్స్ చీఫ్ డైటీషియన్ లతాశశితో పాటు గైనకాలజిస్ట్‌లు, డైటీషియన్లు, క్రిటికల్‌కేర్ నిపుణులు పాల్గొన్నారు.

రేపు గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్

ఖైరతాబాద్, మార్చి 7 : గ్లోబల్ ట్రీ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ అండ్ ఇమ్మిగ్రేషన్ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన బంజారాహిల్స్‌లోని హయత్ ప్లాలెస్ హోటల్‌లో ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల వరకు గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకర్ ఆలపాటి తెలిపారు. సోమాజిగూడలోని గ్లోబల్ ట్రీ సంస్థలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయ న వివరాలు వెల్లడించారు. విదేశాల్లో విద్యనభ్యసించాలనుకునే వారికి సరైన అవగాహనలేక ఇబ్బందులు పడుతుంటారని, వారికి నేరుగా విదేశాలకు సంబంధించిన యూనివర్సిటీ ప్రతినిధులతో సంప్రదించే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఎలాంటి వీసా రుసుం ఉండదని, ఉచితంగా ఐఈఎల్‌టీఎస్‌లో శిక్షణ అందిస్తామని, లక్కీడిప్ ద్వారా ఉచిత విమాన టికెట్ సైతం గెల్చుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు.ఈఫెయిర్‌లో ఉచితంగా పాల్గొనే అవకాశమిస్తున్నామన్నారు.ఫెయిర్‌ను మాజీమంత్రి, మేడ్చల్, మల్కాజిగిరి ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రారంభిస్తారన్నారు. అనంతం ఫెయిర్‌కు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు.

వంద శాతం ఓటింగ్‌తో స్వీప్ చేయాలి

మహిళలకు బహుమతులు అందజేస్తున్న ఈఆర్ఓ సేవా ఇస్లావత్, యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట కిషన్ రావు, విజయ్‌కుమార్ తదితరులు

జూబ్లీహిల్స్, మార్చి 7 : ఓటర్లలో చైతన్యం కల్పిస్తూ 100 శాతం ఓటింగ్ నమోదు చేసేందుకు కృషి చేయాలని జూబ్లీహిల్స్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ డీసీ సేవా ఇస్లావత్ పేర్కొన్నారు. తమ కుటుంబంతోపాటు సమాజంలో అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రభావితం చేయడంలో మహిళలు కీలకపాత్ర పోషించాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గురువారం యూసుఫ్‌గూడ సర్కిల్ పొదుపు మహిళా సంఘాలకు స్వీప్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో మహిళా సంఘాలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయా పోటీల్లో సంకీర్తన(ప్రథమ), భాగ్యలక్ష్మి(ద్వితీయ), రాజకుమారి(తృతీయ), 4 కన్సలేషన్ బహుమతులు పొందిన మహిళలకు యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటకిషన్‌రావు, శానిటరీ సూపర్‌వైజర్ విజయ్‌కుమార్‌తో కలిసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు ప్రశాంత్, వెంకటయ్య, శ్రీనివాసరావు, సురేశ్, ఆర్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుపై సింపోజియం

ఖైరతాబాద్, మార్చి7:ఖైరతాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో సైన్స్, పరిశోధన విభాగం ఆధ్వర్యంలో కృత్రిమ మేధస్సు, యాంత్రిక అభ్యాసం అనే అంశంపై గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులకు సింపోజియం నిర్వహించారు. అనంతరం తెలంగాణలోని వివిధ కళాశాలలకు చెందిన సుమారు 140 మంది విద్యార్థులు ఈ అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించగా, ఉత్తమమైన వాటిని ఎంపిక చేశారు. మొదటి బహుమతి రూ.6వేల నిఖిత, సానియా (సెయింట్ జోసెఫ్ కళాశాల), రమ్య, సాక్షి, శోభ, పూజా(ఐఐఎంసీ), రెండో బహుమతి రూ.4వేలు విష్ణు, ధనుశ్(అవినాశ్ కళాశాల), కోమల్, రవికిరణ్ (ఐఐఎంసీ), మూడో బహుమతి రూ.1000 గాయత్రి రాజ్, భాను, మణిదీప్ (ఐఐఎంసీ)లు గెల్చుకున్నారు. ముఖ్యఅతిథిగా ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ శేషం ఆనంద్ పాల్గొనగా, విజేతలకు డాక్టర్ శేషం ఆనంద్, ప్రిన్సిపాల్ కూర రఘువీర్ చెక్కులు అందజేశారు.

విద్యార్థులకు చెక్కులను అందజేస్తున్న ప్రిన్సిపాల్ రఘువీర్ తదితరులు

శివరాత్రికి దేవాలయాలు ముస్తాబు

వెంగళరావునగర్,మార్చి 7: శివరాత్రి సందర్భంగా దేవాలయాలకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. డివిజన్ పరిధిలోని ఎల్లారెడ్డిగూడ హనుమాన్ దేవాలయం పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. హనుమాన్ దేవాలయం నుంచి శారదా డిగ్రీ కళాశాల వరకు, గంగాధర భక్త సమాజం నుంచి హనుమాన్ దేవాలయం వరకు మట్టి కుప్పలు, వ్యర్థాలను కార్మికులు తొలగించారు. అధికారులతో కలిసి గురువారం సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత పనుల్ని పర్యవేక్షించారు. అనంతరం కార్పొరేటర్ పారిశుధ్య కార్మికులకు సొంత ఖర్చులతో ఉచిత భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

శంషాబాద్ రూరల్, మార్చి7:శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐగా గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించిన నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ..శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక్కడ పని చేసిన సీఐ శ్రీనాథ్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో నరేందర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సీఐని కలిసిన వారిలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కె.చంద్రారెడ్డి, నీరటి రాజు, డి.శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మోహన్, మోహన్ రావు, రవీందర్ ఉన్నారు.

ఉచిత శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలి

హిమాయత్‌నగర్, మార్చి7: రాష్ట్రం లో వివిధ ఉద్యోగాల కోసం సిద్ధమయ్యే నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ అందించేందుకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం హిమాయత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. గ్రూప్–1, 2, డీఎస్సీ వంటి పరీక్షలు రాసే నిరుద్యోగ యువత కోచింగ్ సెంటర్ల బాట పట్టనున్న నేపథ్యంలో ప్రభుత్వం వారికి వసతి కల్పించి ఉచితంగా శిక్షణ ఇవ్వాలని కోరారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

బండ్లగూడ, మార్చి 7: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన పరిధిలో విద్యుత్ సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ శ్రీలత సురేశ్ గౌడ్ విద్యుత్ శాఖ ఏడీఈ సత్యనారాయణను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శ్రీసాయి కాలనీ, వివేకానంద కాలనీ, ఓంనగర్‌కాలనీ, ఇందిరమ్మకాలనీ, వీరబ్రహ్మేంద్రస్వామి కాలనీ తదితర కాలనీల్లో ఓల్టోజీలో హెచ్చు తగ్గుల వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అవసరాన్ని బట్టి నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని, అవసరమైనచోట నూతన విద్యుత్ స్తంభాలను కూడా ఏర్పాటు చేయాలని కోరారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రాజేంద్రనగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్ సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ పక్కన ఓ గుర్తు తెలియని వ్యక్తి(50) కిందపడి ఉన్నాడని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అతను నాలుగు ఐదురోజులుగా అక్కడే తిరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మదన్‌పల్లిలో నూతనంగా నిర్మించిన మల్లికార్జున స్వామి ఆలయం విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, తదితరులు

ఘనంగా మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠ

హాజరైన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, విద్యారణ్య భారతిస్వామి

శంషాబాద్ రూరల్, మార్చి 7: మల్లికార్జున స్వామి నూతన దేవాలయం మదన్‌పల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ లత ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించారు. గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన చేశారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్, విద్యారణ్య భారతిస్వామి వారు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయాన్ని నిర్మించేందుకు ముందుకు వచ్చిన లత ఆంజనేయులు గౌడ్ దంపతులను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం లత ఆంజనేయులు గౌడ్ దంపతుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఎంపీపీ జయమ్మశ్రీనివాస్, జడ్పీటీసీ తన్నీరాజు, వైస్ ఎంపీపీ నీలం, మండల పార్టీ అధ్యక్షుడు కే చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు, దిద్యాల శ్రీనివాస్, నీరటి రాజు, రవీందర్, మాజీ ఎంపీటీసీ మోహన్, శ్రీకాంత్‌గౌడ్‌లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

పిల్లల ఆలోచనలను క్రీడలవైపు మళ్లించాలి: సినీనటుడు సుమన్

బ్లాక్‌బెల్ట్ అందుకున్న మాస్టర్స్‌తో సుమన్

ఖైరతాబాద్, మార్చి 7 : పిల్లలు విద్యార్థి దశలోనే డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు బానిసలవుతుండటం బాధాకరమైన విషయమని, వారిని చిన్నప్పటి నుంచే క్రీడల వైపు వారి ఆలోచనలు మళ్లించేలా తల్లిదండ్రులు కృషి చేయాలని సినీ నటుడు సుమన్ సూచించారు. షాట్‌కాన్ కరాటే అండ్ కుంగ్‌ఫూ అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కరాటేలో శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులకు గ్రాండ్ మాస్టర్, అకాడమీ వ్యవస్థాపకులు సి.రాజు, సీనియర్ మాస్టర్ బి.కృష్ణగౌడ్‌తో కలిసి బ్లాక్ బెల్టులను అందజేశారు. మార్షల్ ఆర్ట్స్‌లో మానసిక స్థైర్యం పెంపొందుతుందని, శారీరక ఆరోగ్యం సైతం లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో జయంత్‌రెడ్డి, ఆర్‌కె.కృష్ణ,ఈ.శ్రీనివాస్, సాయికుమార్, విష్ణుగౌడ్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు హక్కులు సాధించుకోవాలి

హిమాయత్‌నగర్,మార్చి7: రాష్ట్రంలోని ముదిరాజ్ కులస్తులు సంఘటితమై ప్రభుత్వపరంగా వచ్చే హక్కులను సాధించుకోవాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. గురువారం హైదర్‌గూడలో మహాసభ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ముదిరాజ్‌లు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారని, వీరి సంక్షేమం, అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని కోరారు. అనంతరం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా చాట్ల మల్లేశంను నియమిస్తూ నియామకపత్రాన్ని అందజేశారు. మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దెల సంతోష్, నాయకులు వెంకటస్వామి, తీగల సైదయ్య, కందుల శ్రీనివాస్, మహేందర్, సాయికృష్ణ, ఆర్.శ్రీనివాస్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.